క్లుప్తంగా

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

ఎల్కతుర్తి : మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బొంకూరి భద్రయ్య(65) సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. సమాచారం తెలిసి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఇందిరానగర్‌కు చేరుకుని భద్రయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భద్రయ్య మృతి పట్ల సీపీఐ మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, నాయకులు గొడిశాల సమ్మయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, కడారి రాజు, గొల్లె మహేందర్, తంగెడ మహేందర్, లోకిని సూరయ్య, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు..


నర్సింహారావు (ఫైల్)

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పసుపులేటి నర్సింహారావు (85) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆయన సుమారు 25 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా ఎనలేని సేవలు అందించారు. ఆయన మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, పీఆర్‌టీయూలో వివిధ హోదాల్లో పని చేస్తూ విశిష్ట సేవలు అందించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ ఆలూరి రజిత, ఎంపీటీసీ నల్ల కౌసల్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పరామర్శ, ఆర్థిక సాయం



దామెర : మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన ముత్యాల శంకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం వెంకట్రాంరెడ్డి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దామెర, ఆత్మకూర్ మండలాల అధ్యక్షులు మన్నెం ప్రకాష్‌రెడ్డి, కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, నాయకులు కుసమల్ల రవీందర్, జన్ను రాంచందర్, దుబాసి రాజేందర్, దామెర శంకర్, పుచ్చకాయల లింగారెడ్డి, ముత్యాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పులుకుర్తిలో..

మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన ఈదునూరి రాజు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని ఉపసర్పంచ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు పరామర్శించి రూ.8 వేలు నగదు, 50 కిలోల బియ్యం సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈదునూరి స్వామి, గోవిందు ఆదం, కిరణ్‌కుమార్, తిరుపతి, రమేష్, రామస్వామి తదితరులు ఉన్నారు.

రేపు ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సు

ఖిలా వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 19న వరంగల్ రైల్వేగేట్ సమీపంలోని శాంతినగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్స్ సదస్సు నిర్వహించనున్నట్లు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు బోగి సురేష్, ముక్కెర రామస్వామి కార్యదర్శి గన్నారపు రమేష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సదస్సుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సురేష్, రామస్వామి కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేత పుల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అషాడ బహుళ అమావస్య సోమావతి అమావస్య సందర్భంగా మెట్టుగుట్టపై అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఈ రోజున శివుడిని ఎవరైతే అభిషేకిస్తారో వారికి సమస్తమైన వ్యాధులు, రోగాలు, దోషాలు, తొలగిపోతాయని అన్నారు. స్వామి వారు లోకకళ్యాణార్థమై ప్రజలు అందరు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

జీపీ కార్మికులకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకట్రాంరెడ్డి


దామెర : జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కార్మికులు


ఆత్మకూరు : మాట్లాడుతున్న వెంకట్రామ్‌రెడ్డి


ఐనవోలు : మాట్లాడుతున్న తోట భిక్షపతి

ఆత్మకూరు : జీపీ కార్మికులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకోగా కార్మికులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ బృందం జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపింది. అనంతరం వెంకట్రాంరెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి జీపీ కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. 12 రోజులుగా కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తున్నా స్పందించడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, ఇతర సమస్యలను సైతం సానుకూలంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, జిల్లా నాయకులు పర్వతగిరి రాజు, బయ్య తిరుపతి, జయపాల్ రెడ్డి, సందీప్, మల్లారెడ్డి, వడ్డెపెల్లి రాంబాబు, రాజు, నరేశ్, పూలమ్మ, సారంగం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

దామెర : జీపీ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నల్ల చిరంజీవి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి తమను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి మాదరపు బొబ్బిలి, ఉపాధ్యక్షుడు గోవిందు ఆనంద్, కోశాధికారి యజ్ఞం సురేష్, దండ్రె దేవేందర్, కుమరస్వామి, రవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, సీపీఐ సంఘీభావం

ఐనవోలు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ, సీపీఐ సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొక్క రాజు, తోట భిక్షపతి మాట్లాడారు. సమ్మెపై ప్రభుత్వం ఇప్పటి వరకు పెదవి విప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోతు శంకర్, జీపీ ఉద్యోగ కార్మికులు ఏసోబు, రవి, యాకయ్య, చిరంజీవి, సుఖేందర్, మల్లేశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హెచ్చరించారు. మండలంలోని నారాయణగిరిలోని రైతు వేదిక వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ చాలు అనడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ దృఢసంకల్పంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న రైతులపై కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు పిడుగుపాటు వంటివన్నారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా అమలవుతోందా? అని ప్రశ్నించాడు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలపై రైతుల్లో చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ నేతలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. సమావేశంలో డీసీసీబి డైరెక్టర్ గుస్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సర్పంచ్ కర్ర సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు, మల్లక్‌పల్లి సర్పంచ్ మునిగెల రాజు, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ సోంపెల్లి కరుణాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, ఏడుదొడ్ల తిరుమల్‌రెడ్డి, గాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1989లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల ఆవరణలో సోమవారం వేడుకగా సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత నాటి బాల్యమిత్రులంతా ఒకేచోట కలుసుకుని సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఒకరికొకరు తోడ్పాటుగా ఉండాలని, పాఠశాలకు వీలైనంత వరకు సహకరించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం నాడు తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులైన మోహన్‌రెడ్డి, పాపులాల్, రాజిరెడ్డి, శివాజీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ నేరెళ్ల శ్రీనివాస్, గూడెపు రమేష్, తిరుపతి, సారంగపాణి, ఎస్.రమేష్, బి.రాములు, రఫీ, పులి కుమార్, సి.ఉమ, పి.ఉమ, ఎస్.రమ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కర్కాటక సంక్రమణ పూజలు


పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మండల కేంద్రంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు సోమవారం కర్కాటక సంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం సంక్రమణ పూజలతోపాటు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా జరిపించారు. ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసి ప్రత్యేక పూజలు చేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జయపాల్, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, ధర్మకర్తలు రాజబాబు, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, సాయిలు, రాజు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు

అమెరికా పర్యటన ముగించుకుని జిల్లాకు చేరుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఎమ్మెల్యే అరూరి రమేష్‌తోపాటు ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందజేశారు. జాతర సందర్భంగా ప్రధాన ఆలయం చుట్టూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇవ్వగా అందుకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిటీ సభ్యులు కోరారు,

సమస్యల వలయంలో దండేపల్లి

అభివృద్ధిలో వెనుకబాటు, కాలనీలు బురదమయం

- కంపుకొడుతున్న మురికి కాల్వలు
- పంచాయతీ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం


చెత్త, పిచ్చిమొక్కలతో నిండిన మురికికాల్వ

ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి సమస్యల వలయంలో చిక్కుకుందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. గ్రామం రోడ్లు, సైడ్‌కాల్వలు, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉండగా పలు కాలనీల్లోని రోడ్లు స్వల్ప వర్షానికే బురదమయం అయ్యాయి. సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన పంచాయతీ పాలకవర్గంలో విభేదాలు తలెత్తడంతో సమస్యలు పేరుకుపోయాయి. కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌ను, వార్డు సభ్యులను, పంచాయతీ కార్యదర్శులను కోరినా ప్రయోజనం ఉండడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న మురికికాల్వలు

మురికికాల్వల నిర్మాణంలో నాణ్యత లోపించడం, వాటర్ లెవల్ పాటించకపోవడంతో కాల్వల్లో నీరు నిలిచి దుర్వాసన వస్తోన్న పరిస్థితి నెలకొంది. దోమలు ప్రబలి రోగాల బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు వాపోతున్నారు. కాల్వల్లోని చెత్తను తొలగించినా నీరు బయటకు వెళ్లడం లేదు. కాల్వల నిర్మాణంలో కాంట్రాక్టర్ వాటర్ లెవల్ పాటించకపోగా నాసిరకంగా పనులు చేపట్టగా అధికారులు మామూళ్లు దండుకుని బిల్లులు చెల్లించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాల్వల నిర్మాణ పనులను కనీసం ఏఈ సైతం పరిశీలించిన దాఖలాల్లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన పూర్తి చేసి చేతులు దులుపుకున్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అన్ని కాలనీల్లోనూ రోడ్లు బురదమయం

గ్రామంలోని అన్ని కాలనీల్లోని రోడ్లు బురదమయమయ్యాయి. గ్రామ పంచాయతీలో నిధులున్నా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో సీసీ రోడ్ల నిర్మాణం జరగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో మట్టిపోయడంతో గతంలో మంచిగా ఉన్న రోడ్లు సైతం బురదమయమై ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్ల మీదుగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. పలువురు వాహనాలు జారి కింద పడి గాయాలపాలైనట్లు తెలుస్తోంది.

ట్రాక్టర్ రాకపోవడంతో నిలిచిన చెత్త సేకరణ

గ్రామంలోని పలు కాలనీల్లోకి పంచాయతీ ట్రాక్టర్ రావడం లేదని ప్రజలు అంటున్నారు. తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సిన ట్రాక్టర్ రాకపోవడంతో ప్రజలు ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేస్తుండగా ఆ చెత్త కాస్తా మురికి కాల్వల్లోకి చేరి అవి పూడుకుపోయాయి. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఎక్కడి నీరు అక్కడే నిలిచి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ కారణంగా పలు కాలనీల ప్రజలు అంటువ్యాధులు, విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించడంతోపాటు ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మురికికాల్వల్లోని నీరు బయటకు పోవడం లేదు



నీటి లెవల్ పాటించకుండా నిర్మించడంతో మురికి కాల్వల్లో నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. దీంతో ఈగలు, దోమలు ప్రబలి గ్రామంలోని పలువురు రోగాల బారిన పడుతున్నారు. మురికి కాల్వల నిర్మాణంలో కాంట్రాక్టర్ వాటర్ లెవల్ పాటించలేదు. ఈ విషయమై సంబంధిత శాఖ ఏఈకి ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదు. మురికికాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమల బెడద చోటు చేసుకుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాల్వల్లోని నీరు బయటకు వేళ్లేలా మరమ్మతులు చేయించాలి. మురికి కాల్వల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలి. నాణ్యతకు తిలోదకాలిచ్చిన కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలి.

-పానుగంటి సుజాత, గృహిణి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

ఎల్కతుర్తి : మండలంలోని దామెర గ్రామానికి చెందిన చిట్యాల ప్రమోద్ రూ.15 వేల విలువైన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు సీఆర్ పోర్టల్ ద్వారా దొరకబట్టి అతడికి అప్పగించారు. వివరాలిలా.. ప్రమోద్ ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఎస్సై పరమేష్ స్పందించి సీఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్ వెతికి గుర్తించారు. సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితునికి సోమవారం అప్పగించారు. ఎస్సైకి, పోలీసులకు ప్రమోద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైయినీ ఐపీఎస్ అంకిత్ శంక్వార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు దీక్షను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించే రైతు దీక్షకు బీజేపీ నేతలు, కిసాన్ మోర్చా నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలపై బీజేపీ పోరాటాలు చేస్తోందని తెలిపారు. సమావేశంలో బీజేపీ నేతలు రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, ఎరుకుల రఘునారెడ్డి, సుమస్ కత్రి, బైరి శ్యాంసుందర్, ఆడెపు వెంకటేష్, బైరి మురళీకృష్ణ, ఓంప్రకాశ్, కోలారియా, చిలువేరు, రాజేందర్, బైరి నాగరాజు, దుస్సు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వంశీధర్‌రావు



కమలాపూర్ : మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన విష్ణుదాస్ వంశీధర్ రావును యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో అందించిన క్రియాశీలక సేవలను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాహుల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మీడియాతో వంశీధర్‌రావు మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు సాయిని రవిలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా విష్ణుదాస్ వంశీధర్‌రావు నియామకం పట్ల టీపీసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ తౌటం రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దేశిని ఐలయ్య, బాలసాని రమేష్, భిక్షపతి, శివకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ధర్మారెడ్డి సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని తన నివాసంలో ఆ శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్లస్టర్లవారీగా రైతుల, సాగు చేస్తున్న పంటల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటూ పంటక్షేత్రాలను పరిశీలిస్తూ రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుబీమా, రైతుబంధు, ఉచిత 24 గంటల విద్యుత్ అమలుపై చైతన్యవంతం చేయాలని కోరారు. త్వరలోనే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు పరిహారం చెక్కులు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు రైతుబీమా చేయించుకోని రైతులు ఆగస్టు 5లోపు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు రవీందర్, సురేష్, ఏఓ యాదగిరి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఎల్‌ఓసీ అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ శివారులోని తూర్పుకోట ప్రాంతానికి చెందిన గంగరబోయిన శ్రీనివాస్ కుమారుడు గంగరబోయిన శివకుమార్ ఫుట్‌బాల్‌లో నేషనల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. ఇటీవల శివకుమార్ మోకాలికి గాయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన ఎల్‌ఓసీని ఫోర్ట్‌రోడ్డు పెరికవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శివకుమార్‌కు ఎమ్మెల్యే నరేందర్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సురేష్, ఓని భాస్కర్, సంగరబోయిన చందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీడీ నీతి కథల పోటీలు


నీతి కథల పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

హన్మకొండ కల్చరల్ : టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో 'కథ చెబుతావా..ఊ కొడతాం' పోటీల్లో భాగంగా హనుమకొండలోని శశికళ హైస్కూల్‌లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సోమవారం నీతికథల పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో 6 నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులు ఎస్‌సీహెచ్ శ్రీకీర్తికి (షైన్ హైస్కూల్) ప్రథమ బహుమతి, సమీరా (శశికళ హైస్కూల్) ద్వితీయ, ఆర్.మోదిత (శ్రీచైతన్య హైస్కూల్) తృతీయ, జూనియర్ విభాగంలో త్రిష్యశ్రీ (మాస్టర్‌జీ హైస్కూల్) ప్రథమ, లాలిత్య (శశికళ హైస్కూల్) ద్వితీయ, లాస్య (బిట్స్ హైస్కూల్ పరకాల) తృతీయ బహుమతి గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు టీటీడీ డీపీపీ జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు


మురుగునీటి కాల్వలను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ సునీల్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ నుంచి కాజీపేట మార్గంలోని వంద ఫీట్ల రోడ్డు 56వ డివిజన్‌లో మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈమేరకు స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ స్పందించి జేసీబీ సాయంతో కాలువలను శుభ్రం చేయించారు. కాగా, నగరంలోని గోపాపురం క్రాస్ వద్ద పైపులైన్లు దెబ్బతిన్నడంతో మరమ్మతుల కోసం గుంత తవ్వారు. అయితే, మరమ్మతులు చేశాక ఆ గుంతను అలాగే వదిలేయడంతో నల్లాల ద్వారా మురుగునీరు వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.